క్లుప్తంగా

రెవెన్యూ సదస్సు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని రామ చంద్రాపురం, పాత్రాపురం గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల వద్ద నుంచి భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అట్టం సత్యనారాయణ, తహసీల్దార్ అంటి నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మట్టి తవ్వకాలు నిలిపేయండి



వాజేడు: మండలంలో నిర్వహిస్తున్న మట్టి తవ్వకాలను నిలిపేయాలని కోరుతూ జెడ్పీటీసీ తల్లడి పుష్పలత తహసీల్దార్ గూడూరు లక్ష్మణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా మండలంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని దానిని వెంటనే ఆపించాలని కోరారు.

ఆర్థిక సాయం



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని గోరికొత్తపల్లికి చెందిన కట్ల సృజన గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో ఆమెతో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–07 పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందించి, దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆమె అనారోగ్యంపై ఆరా తీసి, భరోసా కల్పించారు. భవిష్యత్‌లో చికిత్స నిమిత్తం ఆర్థికంగా ఆదుకుంటామని తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్ర బృందం పల్లెబోయిన నవీన్, నిమ్మల శంకర్, కట్ల రమేష్, నెల్లి ప్రశాంత్, రమేశ్, సతీష్, చిరంజీవి, నర్సింగరావు, ఏంజల సురేష్, చంద్రమౌళి, రాజు, దాసరి కల్యాణి, హరిత, శిరీషా, స్వప్న, ప్రయాంక, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించాలి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని బీజేపీ నాయకులు రాంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.. ఆజంనగర్ భూపాలపల్లి మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. గతంలో వైద్య, విద్య, హాస్టల్, బ్యాంకు సదుపాయాలు కలిగి ఉండేదన్నారు. ప్రస్తుతం ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకుండా ఉందన్నారు. గ్రామంలో రెవెన్యూ పరంగా ప్రభుత్వ భూములున్నాయని, ప్రభుత్వం అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆజాంనగర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థినికి అభినందన



భూపాలపల్లి అర్బన్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీకి చెందిన సామంతుల వర్షిణి గోల్డ్ మెడల్ సాధించింది. జిల్లా కేంద్రంలోని సన్‌వ్యాలీ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న వర్షిణి అకాడమీ నిర్వాహకులు కరాటే శ్రీను, అశోక్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొంది పోటీలో గోల్డ్ మెడల్‌తో పాటు సర్టిఫికెట్ అందుకుంది. దీంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని సోమవారం పాఠశాల ఆవరణంలో పాఠశాల డైరెక్టర్లు సతీష్, సురేష్‌లతోపాటు అభినందనలు తెలిపారు.

అధికారులు స్పందించాలి

టేకుమట్ల(రేగొండ): కబ్జా స్థలంపై అధికారులు స్పందించాలని కోరుతూ రేగొండ మండలంలోని రంగయ్యపల్లిలో సోమవారం గ్రామస్తులు రోడ్డుపై బైటాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గుర్తించిన స్థలంలో చిలువేరు ప్రవీన్ అనే వ్యక్తి దుఖాణాన్ని ఏర్పాటు చేసుకోవాడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. కబ్జా స్థలంపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ధర్నా చేస్తున్నామన్నారు. కలెక్టర్ స్పందించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాన్ని వెంటనే వెనక్కి తీసుకుని అతడిపై చర్య తీసుకోవాలన్నారు.

చంద్రబోస్ జీవితం ఆదర్శనీయం



చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ములుగు: చంద్రబోస్ జీవితం ఆదర్శనీయమని క్వాలిటీ కంట్రోల్ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సాధనలో భాగంగా ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి దేశ విముక్తి కోసం పోరాడిన గొప్ప సైనికుడు చంద్రబోస్ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఆదిరెడ్డి, కమలాదేవి, కార్యాలయ సిబ్బంది కిరణ్, రవీందర్, తిరుపతి, రమేశ్, మల్లికార్జున్, నరేష్, డీసీఈబీ సహాయ కార్యదర్శి యాసం విక్రంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 3 ప్రకారమే బదిలీలు చేపట్టాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: షెడ్యూల్ ప్రాంతాల్లో జీఓ నంబర్ 3 ప్రకారమే ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(ఏటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని కొమురం భీం విగ్రహం ఎదుట ఏటీఎఫ్, తుడుందెబ్బ, ఏఎస్‌యూ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రాంతంలో ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. జీఓ నంబర్ 317 పేరుతో మైదాన ప్రాంతా ఉద్యోగులను షెడ్యూల్ ప్రాంతంలో బదిలీ చేయడాన్ని ఏటీఎఫ్ త్రీవంగా వ్యతిరేకిస్తుందన్నారు. జీఓ నంబర్ 3ను అమలు చేసేందుకు ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాలు పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పొడెం బాబు, నారాయణబాబు, ఏటీఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకుడు సబ్కా నాగరాజు, జిల్లా నాయకులు వాసం సారంగపాణి, కిరణ్, ఏఎస్‌యూ నాయకులు అరుణ్, సంజీవ పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



ములుగు: దుప్పట్లు పంపిణీ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, నాగరమేశ్

ములుగు: శ్రీరామ కృష్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ నాగ రమేష్ దుప్పట్లను అందించగా సబ్ రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్, డీఎల్‌పీఓ దేవరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై నిరుపేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగ రమేశ్ మాట్లాడుతూ.. చలికాలం తీవ్రత ఎక్కువగా ఉన్నందున సంస్థ తరుపున 30 మందికి దుప్పట్లు అందించామని అన్నారు. అనంతరం ములుగు పట్టణానికి చెందిన రాజు విజయ, యేషబోయిన కొమురమ్మ కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు లలిత సాగర్, కట్టయ్య, హుస్సేన్, రాంరెడ్డి, ట్రస్టు సభ్యులు బడిష నవీన్, ఆదినారాయణ, ప్రవీణ్, రాజశేఖర్, జయరాజ్, మహేష్, నాగరాజు, విష్ణు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపేటలో..

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటకు చెందిన మూల చిన్న మల్లయ్య ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబానికి శ్రీ రామకృష్ణ సేవాట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేశ్, ట్రస్ట్ సభ్యులు రూ.4,000 ఆర్థిక సాయం అందజేశారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో నాయకులు

వాజేడు: మండల పరిధిలోని పేరూరుగ్రామానికి చెందిన సుమారు 35 కుటుంబాలు నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి సమక్షంలో గొడ్డె అనిల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ చేరారు. బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న ప్రజా పథకాలు, ముఖ్యమంత్రి కేసీఆర్ సుపరిపాలన నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. వీరందరికి కండువాలను కప్పి పార్టీలోకి బుచ్చయ్య ఆహ్వానించారు.

బీజేపీలోకి పలువురు..



బీజేపీలో చేరుతున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం భద్రాచలం జరిగిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఆలుబాకకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నానాజీతో పాటు పలువురు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీనాథరావు, ఎంపీపీ సతీష్ కుమార్, జాడిలక్ష్మి, తదితరులు ఉన్నారు.

‘వెల్ విజన్’ ఆధ్వర్యంలో చేయూత



పేదలకు చీరెలు, రమాదేవికి కుట్టు మిషన్ అందజేస్తున్న కొరియన్లు



శ్రీనివాసరావుకు సాయం చేస్తున్న కొరియన్లు

వాజేడు: భారతదేశం అంటే తమకు చాలా ఇష్టమని కొరియా దేశానికి చెందిన ఇండియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నామ్‌సూక్ యోమ్, హెబిన్ అన్నారు. వెల్ విజన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పాయబాటలు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పసుపులేటి రమాదేవికి కుట్టు మిషన్ అందించారు. అంతకు ముందు వెంకటాపురం(కె) మండలంలోని బర్రె బొంద గ్రామంలో వెల్ విజన్ ఫౌండేషన్ ఏర్పాటు వారు నిర్మించిన సియోను ప్రార్థనా మందిరంలో పేదలకు చీరెలను పంపిణీ చేశారు. కేన్సర్‌తో బాధపడుతూ.. అప్పుల ఊబిలో కూరుకుపోయిన నూకల శ్రీనివాసరావుకు రూ.10,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. పేదలకు సాయం చేసే అవకాశాన్ని కల్పించిన వెల్‌విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కందుల శ్రీనివాసరావుకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్‌విజన్ భద్రాద్రి కొత్తగూడెం ఇన్‌చార్జ్ కుమ్మరి రాంబాబు, కేశ్వరావు, ప్రసాద్, జయరాజు, ఎలిసా బాబు, సులోమాన్, జాన్‌పాల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య



మౌనం పాటిస్తున్న శానిటేషన్ సిబ్బంది

ఏటూరునాగారం: నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్న రావుల రమాదేవి నాలుగు నెలల వేతనం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకుందని ప్రభుత్వ ఆస్పత్రి శానిటేషన్ జిల్లా కార్యదర్శి మార సాంబయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రి ఆవరణలో శానిటేషన్ సిబ్బంది ఆమె ఆత్మ శాంతించాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సాంబయ్య మాట్లాడుతూ.. రమాదేవి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు చిన్నా భిన్నం అవుతున్నాయన్నారు. సూపర్‌వైజర్ రంజిత్‌కుమార్, గంగాధర్, సునీల్, లక్ష్మణ్, జగపతిరావు, రాము, రాధా, స్వరూప, సుమలత, ఎల్లమ్మ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

చిట్యాల: మండల కేంద్రంలోని ఐదవ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు సోమవారం అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యకమంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఆశ వర్కర్ కృష్ణవేణి, శైలజతో పాటు తదితులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..



సమావేశంలో పాల్గొన్న ఐక్య సంఘాల నాయకులు

భూపాలపల్లి రూరల్: అనాథ పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే అని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంట్రాక్టు అసోసియేషన్ భవన్‌లో ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. అనాథలకు తక్షణమే ప్రభుత్వం స్మార్ట్ కార్డులు అందించాలని ఐక్య సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఏడేళ్ల క్రిందట యాదాద్రిలో అనాథలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ నెల 30వ తేదీన మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన అనాథలకు సంబంధించిన సమస్యలపై చేపట్టే దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గట్ల రాజన్న, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, రవికుమార్, దూడపాక సుమన్, సోత్కు ప్రవీణ్, విజయ్ పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి



పలిమెల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): 2023–24 ఆర్థిక సంవత్సరానికిగానూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీడీఓ సురేందర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. వాటిలో తాగునీరు, పేదరిక నిర్మూళన, పారిశుద్ధ్యం, బాలికా, మహిళా అభివృద్ధి, పెన్షన్లు తదితర అంశాలపై చర్చించి నిధులను కేటాయించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో అన్ని శాఖల అధికారులతో చర్చించి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి పనులు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాంప్రసాద్‌రావు, విద్యుత్ ఏఈ కనకయ్య, సీడీపీఓ అవంతిక, మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సౌజన్య, అగ్రికల్చర్ అధికారి సునీల్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ హిమబిందు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జీపీడీపీ అమలుపై సమావేశం

పలిమెల: గ్రామ పంచాయతీ డెవెలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) అమలుపై సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జీపీడీపీలో భాగంగా తొమ్మిది అంశాల అమలుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి మదన్, తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



వెంకటాపురం(కె): కంటి వెలుగు శిబిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



చిట్యాల: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



టేకుమట్ల: కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

వెంకటాపురం(కె): కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. మండల పరిధిలోని రాచపల్లి గ్రామంలో సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్ సమ్మయ్య తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమవారం మండల ప్రత్యేక అధికారిని శైలజ, జెడ్పీటీసీ గొర్రె సాగర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ రమేష్, ఎంపీఓ రామకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, ఏపీఎం మంజుల, వార్డు సభ్యులు గట్టయ్య, రమేష్, రవి పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమంపై ఐకేపీ, అంగన్‌వాడీ, రేషన్ డీలర్లు సోమవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ.. పేర్లు నమోదు చేసుకోని, సంబంధిన కరపత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్నవారికి కంటి అద్దాలు అందించడం జరగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది రామిడి సరిత, బొంతల స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు బాలమ్మ, లక్ష్మి, రేషన్ డీలర్ సురేష్ పాల్గొన్నారు.

మహాముత్తారం: మండలకేంద్రంతో మీనాజిపేట గ్రామంలో మూడవరోజు సోమవారం కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో 237మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అందులో 121మందికి అద్దాలు పంపిణీ చేయగా 77మందిని సర్జరీకి రెఫర్ చేశారు. మరో 13మందికి అద్దాలకు ఆర్డర్ చేశారు. మీనాజిపేటలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ రవీంద్రనాథ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బండి శ్రీనివాస్, మమత, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం మండల కేంద్రంతో పాటు, మండలంలోని వెలిశాలలో సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో 257 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 42 మందికి కంటి అద్దాలను అందించారు. అలాగే 27మందికి ఆర్డర్ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆశాజ్యోతి, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ రాజకుమారి, వైద్య సిబ్బంది కృష్ణారెడ్డి, రహీం, భాగ్యలక్ష్మీ, సునీత, శాంత, రమా పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య సూచించారు. కాటారం పీఎచ్‌సీలో కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, ఎంత మందికి అద్దాలు పంపిణీ చేశారు, ఆపరేషన్ల కోసం ఎంత మందిని రెఫర్ చేశారు అనే అంశాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో సౌకర్యాలు పరిశీలించి మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఈ నెల 31న నిర్వహించాలని వైద్యాధికారిణి డాక్టర్ మౌనికను ఆదేశించారు. ఎంపీపీతో పాటు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి అశోక్, డివిజన్ యూత్ ప్రధాన కార్యదర్శి కదారి విక్రమ్ ఉన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామంలో గల బద్ది పోచమ్మ నూతన దేవాలయ నిర్మాణానికి భూమి పూజను ఆలయ నిర్వాహకులు సోమవారం నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనం అనంతరం బోనాలతో బద్ది పోచమ్మ మొక్కులు తీర్చుకోవడానికి భక్తులకు అనుకూలంగా ఉండాలనే ఉద్దేశంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు వారు తెలిపారు. గ్రామ ప్రజలందరి విరాళాల ద్వారా భూమిపూజ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

మహాముత్తారం: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కనుకునూర్, రెడ్డిపల్లి, యామన్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కనుకునూర్, రెడ్డిపల్లి గ్రామాల్లోని 150మంది మహిళలు, యువకులు బీజేపీలో చేరారు. వారికి సునీల్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విఫలమైయ్యాయని అన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న గ్రామాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామన్న కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటి వరకు వాటి ఊసేలేదన్నారు. పక్కనే దేవాదుల ప్రాజెక్టు ఉన్న ఈ ప్రాంతప్రజలు సాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మండలాధ్యక్షుడు సంపత్, పూర్ణచందర్ ఉన్నారు.

సైబర్ క్రైంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహాముత్తారం: సైబర్ సురక్షిత జాతీయ భద్రత కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పోలీసుల ఆధ్వర్యంలో కోనంపేట, యామన్‌పల్లి, నేతకానిపల్లి గ్రామాల్లో ప్రజలకు సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ప్రజలకు ఆన్‌లైన్ మోసాలతో పాటు ఓటీపీ ద్వారా నేరాలు, లోన్ యాప్‌లద్వారా జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి, కానిస్టేబు ల్ మదు, ఉమెన్‌పీసీ నవతరాణి ఉన్నారు.